
# శీర్షిక కథలు

## కొత్త శీర్షిక ప్రారంభం

సాయంత్రం ఆరు గంటలకల్లా మాధవి ట్యూషన్ చెప్పటానికి వస్తుంది. ఆమె వచ్చే టప్పటికి తేజ పుస్తకాలు ముందేసుకుని కూర్చుంటాడు. తేజ అందరిలాంటి పిల్లాడు కాదు. టీవీకి అతుక్కు పోయే అలవాటు లేదు. క్రికెట్ బ్యాట్ పుచ్చుకుని రోడ్డెక్కే ఆలోచన అసలేరాదు. అతనికి ఉన్నదల్లా చదువు ధ్యాసే. క్లాసులో ఎప్పుడూ తనే ఫస్ట్ మార్కులు తెచ్చుకోవాలి. ఆ లక్ష్యసాధన కోసమే ట్యూషన్ చెప్పించుకుంటున్నాడు. అదృష్టం కొద్దీ ఎం.సి.ఏ. చదివే మాధవి ట్యూషన్ చెప్పటానికి ఒప్పుకుంది.



# ట్యూషన్

అంతా బాగానే ఉంది గానీ – ఎటొచ్చీ అసలు సమస్యల్లా తేజ తల్లిదండ్రులతోనే.

మాధవి వచ్చే సమయానికే ఆనందరావు ఆఫీసు నుంచి ఇంటికొస్తాడు. భర్త ఎప్పుడొస్తాడా అని ఎదురు చూస్తుంటుంది శాంత. ఆనందరావు ఇంట్లో అడుగుపెట్టగానే మొదలవుతుంది వాగ్యుద్ధం.

వాదించుకోవటానికి వాళ్లకో టాపిక్ అంటూ ఏమీ ఇవ్వక్కర్లేదు. దేనిమీదనైనా వాళ్లు మాటల యుద్ధం చేయగలరు. అందులో వాళ్లు నిష్ణాతులై పోయారు.

సోఫాలో ఒక చివర మాధవి కూర్చుంది. మరో చివర తేజ కూర్చున్నాడు. ఆమె ఇంగ్లీషు పాఠం చెబుతోంది. తేజ శ్రద్ధగా వింటున్నాడు.

ఆ వేళ కూడా మామూలుగానే ఇండో-పాక్ యుద్ధం మొదలైంది – నిష్కారణంగా ఎలా అంటే–

హాల్లో మరోవైపు ఉన్న టీ.వీ. ఆన్ చేశాడు ఆనందరావు. శాంత కాఫీ తెచ్చి ఇచ్చింది.

''వెళ్లి కూరలు పట్రండి...'' అన్నది శాంత.

''అంటే కాఫీ తాగాలా వద్దా?'' అని అడిగాడు ఆనందరావు.

''ఎంతసేపు తాగుతారు కాఫీ? .... అస్తమానం టీ.వీలో జయమాలిని జ్యోతిలక్ష్మి ఎక్కడ కనిపిస్తారా అని ఛానల్స్ నొక్కుకుంటూ కూర్చుంటారు. ఏ పని చెప్పినా గంటలు గంటలు... లేటు... లేటు... అసలు మీపేరే లేట్ ఆనందరావు...'' అని దులిపేసింది శాంత.

''లేట్ ఆనందరావా?... అంటే అర్థం తెల్సా నీకు? నేను చచ్చాననుకున్నావా?'' అని రెచ్చిపోయాడు ఆనందరావు.

''ఎలా అనుకుంటాను? ... దయ్యంలా కనిపిస్తుంటేనూ ఎదురుగ్గా...''

''ఏంటీ రెచ్చిపోతున్నావ్? నేను దయ్యంలా కనిపిస్తున్నానా నీకు?''

''దయ్యాలు ఇలా కనిపించి అలా మాయమవుతాయ్.... మీరెక్కడ మాయమవుతున్నారు?''

''అంటే దయ్యంలా పట్టి పీడిస్తున్నాననంటావ్?''

''పీడిస్తున్నారని నేను అనలేదు. మీరే అనుకుంటున్నారు... భుజాలు తడుముకుంటున్నారు..''

''ఛీ... కొంపలో అడుగు పెట్టినప్పటి నుంచీ... వెధవగోల...'' అంటూ ఆనందరావు విసురుగా బయటకెళ్లిపోయాడు.

''హు! పౌరుషానికేం తక్కువ లేదు..'' అంటూ శాంత బెడ్ రూంలోకి వెళ్లిపోయింది.

అప్పటిదాకా మౌనంగా ఉండిపోయిన తేజ మాధవితో అన్నాడు ''ఎప్పుడూ ఇలా అరచు కుంటూనే ఉంటారు మేడం... నాకు మూడ్స్ ఉండవు... చదవలేకపోతున్నాను..'' ఉబికి వచ్చే దుఃఖాన్ని ఆపుకుంటూ కన్నీళ్లు తుడుచుకున్నాడు.

''ఇవి ప్రతి ఇంట్లో ఉండే గొడవలే... డోంట్ వర్రీ...'' అని మాధవి తేజ తల నిమిరింది.

మర్నాడు. అదే చోటు. అదే సీన్ –

తేజ లెక్కలు చేస్తున్నాడు.

''నాకు లెక్కలంటేనే భయం మేడమ్...'' అన్నాడు తేజ.

''మనం భయపడినంత కాలం ప్రతిదీ మనల్ని భయపెడుతూనే ఉంటుంది. ఫార్ములా తెల్సు కుంటే ప్రతిదీ ఈజీనే...'' అని చెప్పింది మాధవి.

''ప్రతి దానికీ ఫార్ములా ఉంటుందా మేడమ్?...'' అని అడిగాడు తేజ.

''తప్పకుండా ఉంటుంది...'' అన్నది మాధవి.

ఇంతలో ఆనందరావు ఆఫీసు నుంచి వచ్చాడు. తేజ మాధవి వంక భయం భయంగా చూశాడు. మాధవి ఇబ్బందిగా నవ్వింది.

''ఫార్ములా చెప్పండి మేడమ్...'' అని అడిగాడు తేజ.

''చెప్తాను. చాలా తేలిక...'' అన్నది మాధవి.

ఇంతలో ఆనంద రావు అందుకున్నాడు ''ఏమే.,, ఎక్కడున్నావ్?''

''ఆ... ఏం కావాలి?'' అంటూ కిచెన్‌లో నుంచి వచ్చింది శాంత.

''ఆకలేస్తోంది. టిఫెన్ ఏమన్నా చేశావా?''

''దారిలో అన్ని హోటల్స్ ఉన్నాయి. తిని రావచ్చు గదా. ఇంటికొచ్చి నన్ను కాల్చుకు తినక పోతే..''

''నిన్ను కాల్చుకు తింటున్నానా?''

''నీ యమ్మ, నీ యక్క నన్ను కాల్చుకు తిన్నంత కాలం తిన్నారు... ఇప్పుడు మీరు...''





''బూతులు తిడతావేంటి?'' అని కోపంతో ఊగి పోయాడు. ఆకలి మీదున్న ఆనందరావు.

''మీ అమ్మని అమ్మ అనక, మీఅక్కని అక్క అనక ఏమనమంటారు? నేనేమన్నా ముండలు రండలు అంటూ తిట్టానా?''

''తిడుతునే ఉన్నావు గదా... తిట్టానా... అని రాగాలు తీస్తావేం?''

''వాళ్లు నన్ను ఇంతకు పదిరెట్లు అన్నారు. అప్పుడు మీ నోరు పడిపోయింది... నేను ఏమనక పోయినా ఒంటి కాలిమీద లేస్తారు..''

''అంటే నా నోరు పడిపోవాలనీ, కాలు పడిపో వాలనీ నీ కోరిక... అంతేగా?''

''అంతేగా... అంటే... ఎన్నని గుర్తుంటాయి...''

''ఛీ... నీ మొహం మండ...''

''నీ మొహం మండుతూ ఉంటుంది. నీ మొహాన పేలాలు వేగుతుంటాయి...'' కోపం వచ్చి నప్పుడు ఏకవచనమే... పచనం గాని... వచనం.... అనగా తిట్ల పురాణం అందుకుంటుంది శాంత.

ఆనందరావు 'ఛీ' కొట్టుకుంటూ నిష్క్రమిం చాడు.

శాంత తాచుపాములా బుసలు కొడుతూ మాధవి వంక చూసింది.

''ఎందుకు మేడమ్... అనవసరంగా...'' అని సర్ది చెప్పబోయింది మాధవి.

''మధ్యలో మీరు కలగచేసుకోకండి... మీకు తెలి యదు... ఈ జాతే అంత... మగజాతే అంత... అమ్మ మీద, అక్క మీద ఈగ వాలనివ్వరు... పెళ్లాం అంటే చులకన... లోకువ... ఏం మేం మనుషులం కామా?....'' అంటూ ఉక్రోషంతో ఊగిపోయింది.

మాధవి తేజ వంక చూసింది. అతని కళ్లు తుడు చుకుంటూ ''ఫార్ములా ఉంటే చెప్పండి మేడం..'' అంటున్నాడు.

తరువాత రోజు – అదే చోట... అదే సీన్... అవే పాత్రలు.

ఆనందరావు టీ.వీ. చూస్తూ సిగరెట్టు కాల్చి, నుసి కిందకు విదిలిస్తున్నాడు.

అంతకు ముందే పని కుర్రాడు తెచ్చి టీపాయ్ మీద పెట్టిన ఇస్త్రీ చీరలు మడతలు నలగకుండా చేతిలోకి తీసుకుంటోంది శాంత. ఆనందరావు సిగ రెట్టు నుసి విదిలించాడు మళ్లీ.

''ఏంటిది? సిగరెట్టు రవ్వలు చీరల మీద పడితే చిల్లులు పడతాయి...''

''అంటే నా ఇంట్లో కూర్చుని ప్రశాంతంగా సిగ రెట్టు తాగే యోగ్యత కూడా నాకు లేదన్నమాట...''

''ఏం యోగ్యత... మీ బూడిద ఎత్తిపొయ్యలేక ఛస్తున్నాను...''

''నా బూడిదా? నేను బతికుండగానే నా బూడి దెక్కడిదే నీకు?''

''ఇదంతా ఏంటి? నీ బూడిదగాక, నా బూడిదా?''

''ఒళ్లు కొవ్వెక్కి కొట్టుకుంటున్నావు''.

''అబ్బో... నువ్వు పెట్టే పంచభక్ష్య పరమాన్నాలు తిని... తిని... వొళ్లు కొవ్వెక్కింది... పెళ్ళప్పుడు కుందనపు బొమ్మలా ఉండే దాన్ని... ఇప్పుడు పిచ్చిరూపు వచ్చేసింది. పిచ్చి మనుషులు, పిచ్చి గోలతో వేగలేక...''

''ఎవరు పిచ్చి మనుషులో ఈ వీధిలో అందరికీ తెల్సు...''

''ఎందుకు తెలియదూ... చేసేదంతా చేసి ఏమీ ఎరగనట్లు అమాయకుడిలా మొహం పెట్టటం అందరికీ చేతగావద్దూ...''

''ఏం చెయ్యకుండానే ఇంత యుద్ధం చేస్తున్నావు... ఏమన్నా చేసి బతగ్గలనా?''

''ఇదుగో ఇలా నంగనాచిలా మాట్లాడటమే నాకు చేతగాదు..''

''పోవే ఫో..''

''నువ్వే ఫో...''

ఆనందరావ్ బయటకెళ్లాడు. వీధి చివర బస్ స్టాప్‌లో కూర్చుని వస్తాడు ఒక గంట సేపు. ఆ కాసేపు విరామం ఈ అవిశ్రాంత పోరాటంలో.

తర్వాత రోజు ఇంకో టాపిక్.

శాంత ఎందుకో పాత సంగతి గుర్తు చేసుకుంది. ''ఎప్పుడో పెళ్లప్పుడు ఈయన్ని కట్టుకున్నప్పుడు కట్టుకున్న పట్టు చీరే తప్ప ఎన్నడన్నా మరో పట్టు చీరె కొనిపెట్టారా?'' అని నిష్టూరమాడింది.

''పట్టు చీరలు ఇప్పుడు ఎవడూ కట్టడం లేదు...''

''నీలాంటి వాళ్లు అలాగే అంటారు. పాతవి పనికి రానివి తీసుకెళ్తే వాటిని ఎక్స్చేంజ్ చేసి కొత్తవి తెచ్చుకోవచ్చునని బిగ్‌బజార్ వాళ్లు ఊదర గొడుతున్నారు... మీరు రండి వెళ్దాం రేపు...''

''అంటే నాకర్థం కాలా? నన్ను ఎక్స్చేంజ్ చేసి కొత్త మొగుడ్ని తెచ్చుకుంటావా ఏంటి?''

''అయ్యో సంబడం... నాకంత అదృష్టం ఎక్కడిది? ఎదురింటి వెంకట్రావు చూడు... రెండు ఇళ్లు కొన్నాడు. మూడు ఫ్లాట్స్ కొన్నాడు... నాలుగు నెక్లెస్‌లు చేయించాడు పెళ్లానికి. నిన్న చూపించింది డైమండ్ నెక్లెస్ అట... ఎన్ని లక్షలంటే చెప్పి చావలేదు. అదో కుళ్లు మొహంది... నువ్వూ ఉన్నావ్ ఎందుకు? కంచాలు పెట్టేటప్పుడు తప్ప ఇంకెప్పుడూ లెక్కలోకి తీసుకోవాల్సిన మనిషివి కాదు...'' అని భర్తని తీసి పారేసింది శాంత.

''నీ మొహానికి నేను దొరకటమే ఎక్కువ... మీ అయ్య ఎన్నిలక్షల కట్నం ఇచ్చాడని నీకు రింగ్‌రోడ్డు ఇంజనీర్లు... పులిచింతల కాంట్రాక్టర్లు దొరుకుతారే... నేనుకాబట్టి అదనపు కట్నం కోసం పుట్టింటికి తరమకుండా కూడు పడేస్తున్నాను.... సంతోషించు..'' అన్నాడు ఆనందరావు.

''ఆలికి అన్నం పెట్టడం కూడా ఊరికి ఉపకారమే అన్నాట్ట నీలాంటి వాడు. కటింగ్‌లు పోను కడిగి కడిగి తెచ్చే ముష్టి జీతం తప్ప... ఎన్నడన్నా పైన ఏమన్నా వచ్చాయా.... కన్నీళ్లు తప్ప....''

''పాపపు సొమ్ము నేను ముట్టుకోను...''

''అంతా పుణ్యమే మనకి... డ్రైనేజీ లాగా ఓవర్ ఫ్లో అయి పోతోంది...''

''నీ కిష్టమైతే పడి ఉండు... ఇంతకన్నా నిన్ను నెత్తిన పెట్టుకునే వాడుంటే వాడితోనే ఊరేగు...''

''పదేళ్ల కిందట అని ఉండాల్సిందా మాట...''

ఈ సంభాషణ వినలేక పోతోంది మాధవి. తేజ కూడా తలొంచుకుని గుడ్ల నీరు కక్కుకుంటూ మాధవి వంక చూశాడు.

''ఇవాళ్టికి చాల్లే...'' అనేసి మాధవి వెళ్లిపోయింది.

***

మర్నాడు మాధవి ట్యూషన్ చెప్పటానికి వచ్చేటప్పటికి ఆ ఇంట్లో పరిస్థితి అంతా పూర్తిగా మారిపోయింది.

శాంత దిగాలుగా గోడకు చేరబడి కన్నీరు కారుస్తోంది. ఆనందరావు ఆమెను బతిమిలాడు తున్నాడు – కాసిని మంచినీళ్లు అయినా తాగమని.

''ఏంటలా ఉన్నారు? ఏమైంది?'' అని ఆశ్చర్యంగా అడిగింది మాధవి.

''నా ఖర్మ తల్లీ... ఏం చెప్పమంటావు? నిన్నటి నుంచీ పిల్లాడు కనిపించడం లేదు... ఎక్కడికి పోయాడో తెలియదు. ఏమైపోయాడో తెలియదు... వాడి ఫ్రెండ్స్ అందరి ఇళ్లకీ వెళ్లొచ్చారు ఆయన. ఎవరికీ ఏమీ తెలియదన్నారు... పేపర్లో టీవీల్లో చూస్తుంటే రోజుకో కిడ్నాప్.... రోజుకో మర్డర్... నా బంగారు తండ్రి ఏమైపోయాడోనమ్మా?'' అంటూ శోకంతో దీర్ఘాలు తీసింది శాంత.

''అయ్యో.... అయామ్ సారీ అండీ... తేజ చాలా ఇంటలిజెంట్. అసలు ఈ సంవత్సరం బెస్ట్ స్టూడెంట్ అవార్డు రావాల్సిన వాడు...'' అన్నది మాధవి.

''మాకు ఏ అవార్డులు, రివార్డులు అక్కర్లేదమ్మా... వాడు బతికి ఉంటే చాలు... మళ్లా వాడ్ని చూస్తానో లేదో... చూడాల్సి వస్తే... ఏ స్థితిలో చూడాల్సొస్తుందోనని గుండెలు అవిసి పోతున్నాయి తల్లీ... వాడికి ఏదన్నా అయితే నేను బతకలేను. వాడితోపాటే నేనూ.... నేనూ పోతా... నేనూ పోతా...'' అంటూ శాంత రొప్పుతోంది... ఏడుస్తోంది.

''పోలీసు రిపోర్టు ఇవ్వకపొయ్యారా?'' అని అడిగింది మాధవి.

''ఇచ్చామండి... మీకెవరి మీదన్నా అనుమానం ఉందా అని మమ్మల్ని అడుగుతున్నారు వాళ్లు...'' అన్నాడు ఆనందరావు.

''మాకెవరూ శత్రువుల్లేరమ్మా... మేం ఎన్నడూ ఎవరికీ ఏ ద్రోహం చెయ్యలేదు... దేవుడే... నాకు అన్యాయం చేశాడు. నా బిడ్డని నా నుంచి దూరం చేశాడు..'' అని వాపోయింది శాంత.

''మీరు ధైర్యంగా ఉండండి. తేజకి ఏమీ కాదు. వాడు నాకు తమ్ముడిలాంటి వాడు. ఎందుకో నాకు సిక్స్ సెన్స్ చెబుతోంది. వాడు క్షేమంగా తిరిగొస్తాడని...'' అని మాధవి ధైర్యం చెప్పింది.

''వస్తాడంటావామ్మా... వాడ్ని నేను సజీవంగా చూస్తానంటానా?'' అని ఆశగా అడిగింది శాంత.

''మీరు ఎవరికీ అన్యాయం చేయలేదు. దేవుడు మీకూ అన్యాయం చేయడు...'' అంటూ ఓదార్పు



మాటలు చెప్పింది.

వంటింట్లోకి వెళ్లి కాఫీ పెట్టింది. శాంత, ఆనందరావుకీ ఇచ్చింది. బలవంతాన తాగించింది.

వంట కూడా చేసింది ''తిరిగి తేజను చూడడం కోసం మీరు క్షేమంగా ఉండాలి. క్షేమంగా ఉండా లంటే కొంచెం ఎంగిలి పడాలి'' అంటూ వడ్డించింది.

మర్నాడు వచ్చింది మాధవి.

మూడో రోజు వచ్చింది.

వాళ్లు కొంచెం కొంచెం కుదుట పడ్డాక మాధవి ఇద్దర్నీ కూచో పెట్టి నెమ్మదిగా చెప్పింది.

''మీరు ఒకళ్లను విడిచి మరొకరు ఉండలేరు. విడిచి ఎక్కడికీ వెళ్లలేరు. కలకాలం బతికి ఉండాల్సిన వాళ్లు ప్రతిక్షణం బద్ధశత్రువుల్లా పోట్లాడుకుంటూ, వీధి కుక్కల్లా అరుచుకుంటూ ఉంటే, ఆ పసి వాడి హృదయం ఎంత క్షోభిస్తోందో మీరు ఎన్నడన్నా ఆలోచించారా? ఎదిగే పిల్లలకు అన్నం, నీళ్లు ఎంత అవసరమో చుట్టూ ఆహ్లాదకరమైన వాతావరణమూ అంతే అవసరం. వాళ్లు గొప్ప విద్యావేత్తలుగా, మేధావులుగా ఎదిగినా, లేక గుండాలు, రౌడీలుగా తయారైనా అది వాళ్ల చిన్న నాటి జీవితం మీద ఆధారపడి ఉంటుంది. ఈనాటి యువకులు ఎలా తయారవుతున్నారు? వాళ్ల సున్నితమైన మనసులో ఈర్ష్యలూ, కక్షలూ ఎందుకు చోటు చేసుకుంటున్నాయి? అందమైన అమ్మాయి తిరస్కరిస్తే, యాసిడ్ ఎందుకు పోస్తున్నారు? కత్తితో ఎందుకు పొడుస్తున్నారు? ఈ ప్రశ్నకు సమాధానం చెప్పాల్సిన బాధ్యత తల్లిదండ్రుల మీద ఉంది... ఇంట్లో మీరు ఇలాగే కాట్ల కుక్కల్లా పోట్లాడుకుంటూ ఒకర్నొకరు నిత్యం ద్వేషించుకుంటూ, దూషించుకుంటూ ఉంటే, తేజ కూడా అందర్నీ ద్వేషించడం, దూషించడం నేర్చుకుంటాడు..''

మాధవి చెప్పిన మాటల్ని భార్యాభర్తలిద్దరూ విని ఆలోచనలో పడ్డారు.

''అసలు ఎందుకు మీ జీవితాలను ఇలా దుఃఖమయం చేసుకుంటున్నారు.... భార్యాభర్తలు శత్రువుల్లా ఉండకూడదు. ఆప్తమిత్రుల్లా ఉండాలి. ఒకరికోసం ఒకరి ప్రాణాలు ఇవ్వగల స్థితిలో ఉండాలి. ఎదుటివాడ్ని తీసి పారెయ్యటం, తిట్టెయ్యటం చాలా తేలిక. కానీ ప్రతి మనిషినీ గౌరవించటానికి – మనలో సంస్కారం ఉండాలి...''

శాంత నెమ్మదిగా అన్నది ''నిజమేనమ్మా.... నేను ఇంత దూరం ఆలోచించ లేదు. ఇంత విడమర్చి చెప్పిన వాళ్లూ లేరు...''

''తేజ చాలా బ్రిలియంట్ స్టూడెంట్. వాడ్ని చక్కగా పెంచి పోషించి సక్రమమైన మార్గాన నడిపితే... వాడు మీ ఇంటి పేరు నిలబెడతాడు. ఇండియాకు ప్రెసిడెంట్ అవుతాడు... మీరిలాగే ఉంటే... వాడు ఒక మిలిటెంట్ అవుతాడు... టెర్రరిస్ట్ అవుతాడు. పిల్లల మనసు అందమైన గాజు పాత్రలాంటిది. దానిలో పాలు పెరుగూ పోసినా, విషయం, విద్వేషం పోసినా – అది మీ చేతుల్లోనే ఉంది...''

''నిజమే గానీ, వాడు తిరిగి రావాలి కదా...'' అన్నది శాంత.

''వాడు ఎక్కడికీ పోలేదు. పరీక్షలు దగ్గర పడుతున్నాయని మా ఇంట్లో ఉంచుకుని ట్యూషన్ చెబుతున్నాను...'' అంది మాధవి.

''నిజమా తల్లీ...'' అంటున్న భార్యాభర్తలిద్దరిలోనూ సంభ్రమాశ్చర్యాలు...

ఆనందరావు లైటు వేశారు. ఒక్కసారిగా వెలుగు వెల్లువ వాళ్లను కమ్మేసింది.

శాంత, ఆనందరావు – అప్రయత్నంగా చేతులు జోడించారు.

*



# మీరే డిటెక్టివ్ అయితే...!?

- మల్లాది వెంకటకృష్ణ మూర్తి

## పెళ్లి కూతురు ఎవరు?

ఓ యువకుడు తన ఇంటికి నలుగురు యువతులని భోజనానికి తీసుకెళ్లాడు. లంచ్ అయి వాళ్లంతా వెళ్లాక తను వాళ్లల్లో ఒకర్ని వివాహం చేసుకోబోతున్నానని తల్లికి చెప్పాడు. వెంటనే ఆమె అతని మనసులో ఉన్న అమ్మాయి 'వినత' పేరు చెప్పేయ గలిగింది. ఇదెలా సాధ్యం?

**క్లూ 1:** వసంత డాక్టర్

**క్లూ 2:** సునీత లాయర్

**క్లూ 3:** వినత ఇంజనీర్

**క్లూ 4:** ఆ యువకుడికి ఇంజనీర్‌ను చేసుకోవాలని ఉంది.



సొల్యూషన్ : వినత ఆ యువకుడి తల్లికి నచ్చలేదు కాబట్టి ఆమెనే అతను చేసుకోవచ్చనుకుని ఆ పేరు చెప్పింది.

మీరే డిటెక్టివ్ అయితే...